క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ముసునూరు: చెక్కపల్లిలోని శ్రీకృష్ణ పరమాత్మ మందిరంలో గురువారం విగ్రహ, ధ్వజ స్తంభ, శిఖర, బొడ్డురాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నేతలతో కలిసి శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మేకా ప్రతాప్‌ను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి వారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని పూజలు చేశారు.

కల్యాణ మండపం ప్రారంభం



కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరంలోని ముగ్గురమ్మల ఆలయం వద్ద నిర్మించిన కల్యాణ మండపాన్ని గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త బోడేపూడి అప్పారావు, కాశీరత్నం దంపతులు గురువారం ప్రారంభించారు. సర్పంచి దండుబోయిన రాజేంద్రప్రసాద్ కోరిక మేరకు బోడేపూడి అప్పారావు దంపతులు సుమారు రూ.35 లక్షలు వెచ్చించి ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాణ దాత బోడేపూడి అప్పారావు దంపతులను సర్పంచి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ ముద్దంగుల రంగస్వామి, ఉపాధ్యాయుడు బి.కమలేశ్వరరావు, పలువురు గ్రామస్తులు సన్మానించారు.

క్షయవ్యాధిపై అవగాహనా ర్యాలీ



మల్లేల(తిరువూరురూరల్): టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లేలలో వైద్య, ఆరోగ్య సిబ్బంది గురువారం క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధి లక్షణాలున్నట్లు అనుమానం వస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని, క్లో పరీక్షతో టీబీని గుర్తించవచ్చని సూపర్‌వైజర్ దినీప్ తెలిపారు. టీబీ లక్షణాలను తెలుపుతూ గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఆరోగ్య, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల యోగా సాధన



విస్సన్నపేట: స్థానిక మండల పరిషత్ ఆవరణలో యోగా కార్యక్రమం గురువారం నిర్వహించారు. తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, మండల పరిషత్ సిబ్బంది, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు యోగా సాధన చేశారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సమావేశం శుక్రవారం జరుగుతుందని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షురాలు లంకా నిర్మల అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వినతి



వత్సవాయి: కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ హనుమంతరావు అన్నారు. ఈమేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఆర్ఐ జనార్దనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది రైతులు కౌలు వ్యవసాయం చేస్తున్నారని, గత సంవత్సరం మిర్చి పంటకు ధర లేక తీవ్రంగా నష్టపోయారన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు లేక పోవటంతో ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, పంట నష్ట పరిహారం అందలేదన్నారు. గ్రామాల్లో గ్రామ సభలు పెట్టి ఆ సభలో కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

వ్యాపారాలు లేక వెలవెల

- పేద, మధ్యతరగతి ప్రజల్లో తగ్గిన కొనుగోలు శక్తి
- అద్దెలు చెల్లించలేక దుకాణదారుల ఇక్కట్లు
- మూతబడుతున్న దుకాణాలు



తిరువూరు ప్రధాన సెంటర్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న దుకాణాలు

తిరువూరు: తిరువూరు డివిజన్‌లో ఏడాది కాలంగా వ్యాపారాలు సాగడంలేదు. కనీసం నెలవారీ అద్దెలు సైతం చెల్లించలేని స్థితిలో చిన్న, మధ్య తరహా దుకాణాలను మూసివేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయి. గతంలో వాణిజ్య కూడలిగా ఉన్న తిరువూరులో ప్రస్తుతం హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలు సగానికి పైగా పడిపోవడం గమనార్హం. తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం, కంభంపాడు వ్యాపార కూడళ్లుగా ఎంతోకాలంగా అన్ని దుకాణాలు ఏర్పాటవగా మారుతున్న పరిస్థితుల్లో పాత వ్యాపారులు కనుమరుగవుతున్నారు. గత ఏడాది కాలంలో తిరువూరులోనే 100కు పైగా దుకాణాలు మూతబడ్డాయి.

అద్దెలు సైతం కట్టలేక..

కిరాణా, వస్త్ర దుకాణాలు, ఫ్యాన్సీ, చేతివృత్తి దుకాణాలకు వేలాది రూపాయల అద్దె చెల్లించలేక వ్యాపారులు షాపులను ఖాళీ చేస్తున్నారు. అద్దెలు గణనీయంగా పెరుగుతుండటంతో పాటు బేరాలు లేక సతమతమవుతున్న స్థానిక వ్యాపారులు తమ దుకాణాలను మూసివేస్తున్నారు. తిరువూరులోని చీరాల సెంటర్, బోస్ సెంటర్, గణేష్ సెంటర్, జైబావి సెంటర్లలో పలు షాపింగ్ కాంప్లెక్సులలో అద్దెకు ఇస్తామనే బోర్డులు దర్శనమిస్తున్నాయి.

తగ్గిన కొనుగోలు శక్తి..

సంక్షేమ పథకాల ద్వారా కూటమి ప్రభుత్వం ఆదుకోకపోవడం, రోజువారీ కూలిపనులు చేసే వారికి ఉపాధి దొరక్కపోవడం తదితర కారణాలతో తిరువూరు డివిజన్‌లో ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పడిపోతున్నాయి. అసలే ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటానికి తోడు పిల్లల చదువులు, కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల కోసం డబ్బులు వెతుక్కోవలసిన పరిస్థితి నెలకొందని పలువురు వాపోతున్నారు. పెట్రోలు బంకులు, సూపర్‌బజార్లు, మందుల దుకాణాలు, ఫ్యాన్సీ, రెడీమేడ్, వస్త్ర దుకాణాలు, కిరాణా, జనరల్ స్టోర్స్, ఎలక్ట్రికల్, హార్డ్‌వేర్ దుకాణాలు తిరువూరు డివిజన్‌లో మూతబడుతున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ ప్రభావం, కార్పొరేట్ వ్యాపార శాఖలు విస్తరించడం కూడా చిన్న, మధ్య తరహా దుకాణాలకు పెను సవాలుగా మారింది. వ్యాపార కూడళ్లలో సైతం ఖాళీ అవుతున్న షాపులు నెలల తరబడి టులెట్ బోర్డులతో కనిపిస్తున్నాయి.

వ్యాపారాలకు దెబ్బ



గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గత ఏడాది కాలంగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదు. కుటుంబ అవసరాలు తీరడం లేదు. విలాస వస్తువుల జోలికి అసలు పోకపోగా, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ తదితర వస్తువులను అసలు కొనే పరిస్థితి లేదు.

– మామిడి కుటుంబరావు, ఆంజనేయపురం

ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలి



పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం అండగా నిలిచి వారి జీవన ప్రమాణాల పెంపునకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజకీయాల కతీతంగా అన్ని కుటుంబాలకూ నగదు బదిలీ పథకం అమలై కొంత మేర పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ప్రస్తుత దయనీయ పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు.

– కాలసాని గోపాల నాగేశ్వరరావు, తిరువూరు

రాష్ట్ర ప్రజలను వంచించిన టీడీపీ, జనసేన

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: అధికార పీఠం ఎక్కి ఏడాది గడిచినా సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా టీడీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రజలను వంచించాయని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం ప్రతిపక్ష పార్టీని విమర్శించడం, కేసుల పర్వంతో సమయాన్ని ప్రభుత్వం వృథా చేస్తోందన్నారు. చింతలపూడి ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో విఫలమైందన్నారు. పోలవరం నిర్వాసితులకు ప్యాకేజీ ఇవ్వనన్న కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించలేని స్థితిలో ఉందని విమర్శించారు. నిరుద్యోగులకు భృతి, మహిళలకు ఉచిత బస్సు, రైతు భరోసా, ఉద్యోగ వర్గాలకు ఓపీఎస్ పునరుద్ధరణ, నిరుద్యోగులకు ఉపాధి జాబ్ క్యాలెండర్, మహిళలకు నెలకు రూ.1500, ఇల్లు లేని వారికి పల్లెల్లో మూడు సెంట్ల స్థలం, పట్టణాల్లో రెండు సెంట్ల స్థలం ఇస్తానన్న హామీలు నీటిమూటలుగా మిగిలిపోయాయని ధ్వజమెత్తారు. ఉభయ గోదావరి, రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో బర్లీ పొగాకును కార్పొరేట్ సంస్థలు కొనుగోలు నిలిపివేయడంతో రైతులు తీవ్ర సంక్షోభంలో పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. రుతు పవనాలు ముందుగా వచ్చినా విత్తనాలు సరఫరా చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రాన్ని రుణాంధ్రగా మార్చిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నూజివీడు: పట్టణంలోని పలువురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. శారదా జూనియర్ కళాశాలకు చెందిన కుప్పాల దేదీప్యసాయి బైపీసీలో వెయ్యి మార్కులకు గాను 991మార్కులు సాధించి ప్రతిభ పురస్కారానికి ఎంపికై ంది. విద్యార్థినిని శారదా విద్యా సంస్థల చైర్మన్ కె. శంకర్‌రావు, కరస్పాండెంట్ రాధిక, అధ్యాపక బృందం అభినందించారు. సిద్దార్థ జూనియర్ కళాశాల నుంచి సీఈసీ గ్రూపు విద్యార్థి పూల వెంకన్నబాబు, ఎంఈసీ గ్రూపు నుంచి షేక్ అబ్దుల్ సలాంలు ఎంపికయ్యారు. వీరిని కళాశాల డైరెక్టర్ గొల్లపల్లి రవి బాబు, ప్రిన్సిపాల్ జి. శ్రీమన్నారాయణ, అధ్యాపక బృందం అభినందించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ రక్షణ

మంత్రి పార్థసారధి



బత్తులవారిగూడెం నగరవనంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి పార్థసారథి



విస్సన్నపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటుతున్న సర్పంచ్, అధికారులు



జి.కొండూరులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ, అధికారులు



ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌లో మొక్కనాటి నీళ్లు పోస్తున్న ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు

నూజివీడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి పార్థసారథి బత్తులవారిగూడెంలోని నగర వనంలో గురువారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా వ్యాప్తంగా ఈ ఒక్కరోజే పర్యావరణ పరిరక్షణకు నాలుగు లక్షల మొక్కలను నాటే బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నూజివీడు అటవీ శాఖ పరిధిలో 5 వేల మొక్కలు నాటుతున్నామని చెప్పారు. అనంతరం మంత్రి పార్థసారథి ప్రతిజ్ఞ చేయించి వివిధ ప్రభుత్వ అధికారులను సన్మానించారు. జిల్లా అటవీ శాఖ అధికారి శుభమ్, నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్, ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్, సర్పంచి ముసునూరి లక్ష్మి, అటవీశాఖాధికారులు పాల్గొన్నారు.

తిరువూరు: వాతావరణ కాలుష్యం పెరిగిపోతున్నందున పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం కట్టాలని తిరువూరు ఆర్డీఓ కె. మాధురి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తిరువూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. మునుకుళ్ల రోడ్డులోని పోతుల చెరువు కట్టపై మొక్కలు నాటారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకం వద్దని, పచ్చని చెట్లను నరకవద్దని, ప్రతి ఇంట్లో ఒక మొక్క నాటి పెంచాలని ఆర్డీఓ సూచించారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, చైర్‌పర్సన్ నిర్మల, తహసీల్దార్ లక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

తిరువూరులో ర్యాలీ

తిరువూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శన నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సిందూర, న్యాయవాదులు పాల్గొన్నారు.

- మైలవరం: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణ సమతుల్యం కాపాడాలని మైలవరం ఎంపీడీఓ పి. అనూరాధ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మైలవరంలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ గురువారం నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ఎంఈఓ ఎల్.బాలు, ఎంపీపీ ప్రసన్నరాణిస్వామి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- జి.కొండూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను కూడా చేపట్టాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జి.కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ రామకృష్ణనాయక్, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లుతో కలిసి ఎంపీపీ గురువారం మొక్కలను నాటారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌లో..

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమం గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో గురువారం జరిగింది. ఉపాధిహామీ పథకం రాష్ట్ర డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్, డ్వామా పీడీ ఎ.రాము, డీపీఓ లావణ్యకుమారి పాల్గొని 300 మొక్కలు నాటారు. మరో 650 మొక్కలు వివిధ గ్రామాల్లోని పంట కుంటల గట్లపై నాటేందుకు సిద్ధం చేశామని వారు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. సర్పంచి భుక్యా కవిత, ఎంపీడీఓ సునీత శర్మ, డెప్యూటీ ఎంపీడీఓ మనోజ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. పరిసర గ్రామాల్లో మొక్కలు పంపిణీ చేశారు. అకడమిక్ డైరెక్టర్ టి.నారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్, ప్రోగ్రాం అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కలు జీవనాధారం

ఇబ్రహీంపట్నం: మానవ మనుగడకు మొక్కలు జీవనాధారమని ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధరబాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎన్టీటీపీఎస్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ థర్మల్ ప్రాజెక్టులలో మొక్కలు నాటే కార్యక్రమాలను వర్చువల్‌గా ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటే భవిష్యత్ తరాల వారు తీవ్రమైన ఇబ్బందులు పడతారని వివరించారు. ఎన్టీటీపీఎస్ ఏ,బీ,సి కాలనీల్లో విరివిగా మొక్కలు నాటారు. ఏపీ జెన్‌కో హైడల్ డైరెక్టర్ సుజయకుమార్, సీఈ శివరామాంజనేయులు, విద్యుత్ సౌధకు చెందిన ముఖ్య ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఇంటింటా మొక్కలు నాటాలి..

ఆంజనేయపురం(తిరువూరురూరల్): ప్రతి ఇంటిలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని తిరువూరు మండలం ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు అన్నారు. గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సచివాలయం వద్ద, పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర, ఎంపీటీసీ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

- ఆగిరిపల్లి: పర్యావరణ సమతుల్యత కాపాడేందుకు మొక్కల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ బి .భార్గవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో, బొద్దనపల్లి ఎంపీయూపీ పాఠశాలలో మొక్కలు నాటి మాట్లాడారు. ఎంఈఓ సర్వేశ్వరరావు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటారు. ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వెంకట్రావు ఆధ్వర్యంలో కనసానిపల్లిలో మొక్కలు నాటారు.
- చాట్రాయి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈశ్వరరావు, ఎంపీడీఓ ఐ. విజయలక్ష్మి, ఏపీఓ విజయలక్ష్మి మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ కమల విష్ణు తదితరులు పాల్గొన్నారు.
- విస్సన్నపేట: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, హెల్త్‌సెంటర్, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ చేకు చినరాట్నాలు, తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి, గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, ఏపీఓ రామారావు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.
- మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో జాతీయ సేవా విభాగం, ప్రకృతి క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, డీన్ ఇండస్ట్రీస్ అండ్ రిలేషన్స్ డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ముసునూరు: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ బసవరాజు అచ్యుత సత్యనారాయణ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఉపాధి హామీ ఏపీఓ రోజ్‌లీల, మండల పరిషత్, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

ఎంఈఓ సర్వేశ్వరరావు హెచ్చరిక

ఆగిరిపల్లి: మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తక విక్రయాలు జరిగితే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ సర్వేశ్వరరావు హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం కాకుండానే ఆగిరిపల్లిలోని కొన్ని ప్రైవేట్ పాఠశాల్లో అత్యధిక ధరలకు పుస్తకాలు విక్రయాలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని, అటువంటి పాఠశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వం పుస్తకాలు, యూనిఫామ్ విక్రయించుకునేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని, తల్లిదండ్రులు గమనించాలని ఆయన కోరారు.

చింత చెట్టుకు నిప్పు



మైలవరం: మైలవరం శివారు మార్కెట్ యార్డు వద్ద ఉన్న పురాతన చింత చెట్టుకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: పుల్లూరు సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ కొత్తగూడెం ఏజీఎల్ ఫీడర్ మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మైలవరం ఏఈ గార్లపాటి రమేష్‌బాబు తెలిపారు. పుల్లూరు, దాసుళ్లపాలెం, కొత్తగూడెం గ్రామాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

- నూజివీడు: పట్టణంలోని ఆటోనగర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, ఆటోనగర్‌లోని పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు.

పని గంటల పెంపును నిరసిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్మికుల పని గంటలు పెంపు నిర్ణయం అత్యంత దుర్మార్గమని, కూటమి.. కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పనిగంటలు పెంచడాన్ని నిరసిస్తూ బీసెంట్ రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలును నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనికోసం పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కార్మిక వ్యతిరేకమని ధ్వజమెత్తారు. కనీస వేతనాలు పెంచడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా లేదని, పని గంటలు పెంచేందుకు మాత్రం అత్యుత్సాహం చూపిందన్నారు. తక్షణం లేబర్ కోడ్స్‌ను, దాని అనుబంధ రూల్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరగనున్న జాతీయ సమ్మెలో కార్మికవర్గం పాల్గొనాలన్నారు. రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గారావు, నారాయణ, జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, ఎం.బాబురావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మైలవరంలో క్యారమ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు చదివించి, వారి జీవిత చరిత్రను చెప్పించారు. అనంతరం విద్యార్థులతో స్వర్ణాంధ్ర-స్వర్ణాంధ్ర అంశంపై వ్యాసరచన, ఇన్‌డోర్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. సినీ గేయ పోటీలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా స్థానిక విశ్రాంత ఉద్యోగి డీవీ ప్రసాద్ వ్యవహరించారు. విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం ఉదయం పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కథలు చెప్పించారు. విద్యార్థులకు స్వర్ణాంధ్ర విజన్ 2047 అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు రోజులుగా రోడ్డు పక్కనే గేదె కళేబరం

కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్న వైనం



జి.కొండూరు: జి.కొండూరు శివారులోని 30 నంబరు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొని గేదె మృతి చెందింది. చీకట్లో ఈ గేదె కనిపించక బైకుపై వస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన వీసా రాజేష్ అనే యువకుడు గేదెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. అయితే మృత్యువాత పడిన గేదెను రహదారి నుంచి మార్జిన్‌లోకి జరిపిన అధికారులు దానిని తరలించకుండా అలానే వదిలేశారు. గేదె చనిపోయి రెండు రోజులు కావడంతో శరీరం ఉబ్బిపోయి జాతీయ రహదారిపై తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది. హైవే అధికారులు బాధ్యత లేకుండా వ్యవహరించడంతో వాహన చోదకులు అటుగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మృతిచెందిన గేదెను అక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.

గులాబీ రంగు పురుగు నివారణకు చర్యలు

చందర్లపాడు(నందిగామ రూరల్): పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీనియర్ శాస్త్రవేత్త రాజప్ప అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చందర్లపాడు మండలం పొక్కునూరు, కాసరబాద గ్రామాలలో గరికపాడు కేవీకే శాస్త్రవేత్తలు గురువారం రైతులకు అవగాహన కల్పించారు. రాజప్ప మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయం, నూతన వంగడాలు, పచ్చిరొట్ట ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా వేసవి దుక్కుల వల్ల పంట పొలాలు సారవంతమవుతాయని తెలిపారు. మట్టి పరీక్షలు చేయించటం వల్ల భూమిలోని లోపాలను గుర్తించి అందుకనుగుణంగా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు సూచనల మేరకు ఎరువులను వాడాలని చెప్పారు.